క్లుప్తంగా

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డుంబ్రిగుడ: మండలం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీవో నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మండలంలోని పోతంగా, కొర్రాయి, సాగర పంచాయతీల్లోని డుంబ్రిగుడ, జాకరవలస, సాగర అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పీఎం జన్‌మన్ పథకం ద్వారా బుడ్డింగులో ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 35 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వచ్చే నెల 4వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

నేటి నుంచి గోమంగిలో వేదాంత మహాసభలు

పెదబయలు: ఉగాది వేడుకల్లో భాగంగా పెదబయలు మండలం గోమంగి పంచాయతీ సరియాపల్లి, కుమ్మరివీధి గ్రామాల సమీపంలో శుక్ర, శని, ఆదివారాల్లో వేదాంత మహాసభలు నిర్వహించనున్నట్టు సద్గురువులు కుంబిడి సత్యనందస్వామి, లోచలి భగీరానందస్వామి, గురు భక్తుడు కొమ్మ కొండబాబు తెలిపారు. ఆదివాసీ గిరిజన వేదాంత తత్వప్రబోధాలకు గురువులు గొర్లె నాగయ్యాచార్యులు, కాకా నారాయణదాసు, గొరగల కాంతనందస్వామి హాజరు కానున్నారని పేర్కొన్నారు. శుక్ర, శని వారాల్లో విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన, అఖండ దీపారాధన, తత్వ పరీక్షలు, సందీ ఫలములు, ఆధ్యాత్మిక ఉపాన్యాసాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం కుంకుమార్చన, హోమ పూజ చేస్తామన్నారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

లైంగిక దాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చింతూరు: ఎటపాక మండలం బాడిశగుంపులో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కెచ్చెల కల్పన గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, పోక్సో చట్టమున్నా రోజురోజుకూ మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే మహిళా సంఘం తరఫున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు.

నవోదయకు లక్ష్మీపురం విద్యార్థుల ఎంపిక



నవోదయకు ఎంపికైన విద్యార్థులు

ఎటపాక : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలోని పలు పాఠశాలల్లో చదువుతున్న బండి లాస్య, కొల్లు లేనిషా, మరో విద్యార్థిని పనితి విన్నిక నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి అర్హత సాధించారు. వారిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సెకీ ఒప్పందం రద్దు చేయాలి

నర్సీపట్నం: సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం ఏపీఈపీడీసీఎల్ (ఇండోర్) సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసుకున్న చీకటి సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఒప్పందం రద్దు చేయమని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందూజాతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీలు విధించిందన్నారు. విద్యుత్ భారంపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని రాజు పిలుపునిచ్చారు.

ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్లు

మాడుగుల రూరల్: దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీ కోసం వచ్చే నెల 1వ తేదీ నుంచి సదరం స్లాట్ల బుకింగ్ పునఃప్రారంభం అవుతుందని స్థానిక ఎంపీడీవో కె. అప్పారావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా కొంత కాలంగా నిలుపుదల చేసిన సదరం స్లాట్లు సచివాలయాల్లో ఓపెన్ అవుతాయన్నారు. ఎంపిక చేసిన ఏరియా, జిల్లా, టీచింగ్ ఆస్పత్రులు, జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్) అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. దీనికిగాను 7వ తరగతి చదివి, 18–44 ఏళ్లలోపు ఎస్సీ మహిళలు అర్హులన్నారు. ఇతర వివరాలకు 7780275922 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



పూజలందుకుంటున్న రాజవొమ్మంగి గ్రామదేవత శ్రీనూకాలమ్మ తల్లి



విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న రాజవొమ్మంగి గ్రామదేవత ఆలయం



నూకాలమ్మ జాతర సందర్భంగా రాజవొమ్మంగిలో ఏర్పాటైన జెయింట్ వీల్

రాజవొమ్మంగి జాతర.. 150 ఏళ్ల చరిత్ర

- గ్రామ దేవత నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి 4 రోజుల పాటు ఉత్సవాలు
- ఇంటి ముంగిట వేప కొమ్మకు పూజలు చేయడం ఆనవాయితీ

రాజవొమ్మంగి: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి, రాజవొమ్మంగి గ్రామ దేవత నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడి అమ్మవారు చిన్నపిల్లలతో ఆడలాడుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. చుట్టు పక్కల గ్రామాల్లోని గిరిజనులు ఇంటిల్లిపాది వచ్చి రాజవొమ్మంగి గ్రామదేవతకు పూజలు చేయడం సంప్రదాయం. దాదాపు 150 సంవత్సరాలుగా అమ్మవారి తిరునాళ్ళు వైభవంగా జరుపుకొంటున్నామని పెద్దలు చెబుతున్నారు. ప్రతి కుటుంబం ఇంటి ముంగిట వేప కొమ్మ నాటి అమ్మవారిని పసుపు కుంకుమలతో పాటు రకరకాల పిండి వంటలు సమర్పించి పూజలు చేయడం ఈ జాతరలో అనాధిగా వస్తున్న ఆచారం. తిరునాళ్లలో భాగంగా అమ్మవారి ప్రతి రూపాలైన గరగల నృత్యాలు



ముస్తాబైన కళావేదిక

ప్రధాన ఘట్టం. కొత్త అమావాస్యకు పది రోజుల ముందు అమ్మవారి గుడి తలుపులు తెరుస్తారు. ఆ తరువాత గరగలను అమ్మవారి పుట్టిల్లు అయిన విక్రమహంతి వారి ఇంటికి అప్పగిస్తారు. పుట్టింటి వారు అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఆ తరువాత ప్రతి రోజు గరగలు గ్రామంలో రాత్రి పూట ఊరేగుతాయి. ఈ ఏడాది అమ్మవారి తిరునాళ్లను ఈ నెల 28, 29, 30, 31 తేదీల్లో జరుపుకొనేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఏప్రిల్ ఒకటో తేదీన గుడి తలుపులు తిరిగి మూసివేస్తారు.

ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణలు

జాతర సందర్భంగా అమ్మవారి గుడిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించారు. వీధులను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. పిల్లల కోసం గ్రామం నడిబొడ్డున జెయింట్ వీల్, ఇతర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అడుగడుగునా వివిధ రకాల స్టాల్లు వెలిశాయి. నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా అడ్డతీగల, వై.రామవరం, నర్సీపట్నం, కొయ్యూరు, నాతవరం, తదితర మండలాల నుంచి దాదాపు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇందుకు తగినట్లు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా స్థానిక పోలీసులు భారీ బందోబస్త్ నిర్వహిస్తున్నారు. సర్పంచ్ రమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు, స్థానిక అఖిలపక్ష నాయకులు స్వయం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తాపీమేస్త్రీ సంఘం నాయకులు, స్థానిక యువత, రైతులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.



జాతరలో చిన్న పిల్లల కేరింతలు



నూకాలమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని మలకపాలెం సతకం పట్టుకు తీసుకెళ్తున్న గిరిజనులు

మన్యంలో నూకాలమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం



సాక్షి, పాడేరు: కొత్త అమావాస్య కారణంగా మన్యంలో నూకాలమ్మతల్లి ఉత్సవాలను గురువారం గిరిజనులు ఘనంగా ప్రారంభించారు. పాడేరు, అనంతగిరి, అరకులోయ, చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో నూకాలమ్మతల్లి ఆలయాలు ఉన్నాయి. పాడేరుకు సంబంధించి 12వ మైలురాయి, కక్కి,వంట్ల మామిడి ప్రాంతాల్లోని నూకాలమ్మతల్లి ఆలయాల్లో మూడు రోజుల జాతరను గిరిజనులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. ఆలయాల్లోని నూకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లోని సతకంపట్టు వద్ద నూకాలమ్మతల్లి ఉత్సవ విగ్రహాలు, ఘటాలను ప్రతిష్ఠించారు. ఈ నెల 29వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. చివరి రోజు నూకాలమ్మతల్లికి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకోవడంతో పాటు ఊరేగింపు సంబరాన్ని వైభవంగా నిర్వహించేందుకు గిరిజనులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీహెచ్‌సీలో 20 మంది రక్తదానం



వై.రామవరం సీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణతో పాటు స్టేషన్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జీ42 బెటలియన్ అదనపు బలగాల పోలీసులు ఎక్కువ మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన ఇచ్చిన ఈ రక్తాన్ని స్థానిక సీహెచ్‌సీలో ఉన్న బ్లడ్ బ్యాంకులో భద్రపరుస్తామన్నారు. రక్తదానం చేసిన ఎస్ఐ రామకృష్ణను డాక్టర్ రాహుల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ రాథ, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గెమ్మెలి ఉప సర్పంచ్ వైఎస్సార్‌సీపీ కైవసం



ఉప సర్పంచ్ కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సర్పంచ్ కొండబాబు, డేవిడ్

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం ఎన్నికల అధికారి డేవిడ్ గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారులు ఇద్దరు పోటీ చేయగా.. వార్డు మెంబర్లు చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు, 14వ వార్డు సభ్యుడు ఐసరంగి కోటేశ్వరరావు విజయం సాధించారు. ఆయనకు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. కోటేశ్వరరావును సర్పంచ్ సీదరి కొండబాబు, ఎన్నికల అధికారి డేవిడ్, సహాయాధికారి రవి, వార్డు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

‘సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర’



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు విమర్శించారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో పార్టీ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తే, కూటమి ప్రభుత్వం ఏర్పడి కొన్ని నెలలకే సచివాలయాల కుదింపునకు ప్రయత్నాలు మొదలు పెట్టడం అన్యాయమన్నారు. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలకు 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, ప్రస్తుతం వాటిని 9 సచివాలయాలకు కుదించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిసిందన్నారు. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక్క సచివాలయం ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. జనాభా ప్రాతిపదికన సచివాలయాలు, ఉద్యోగుల కేటాయింపు వల్ల గిరిజనులు పాలనకు దూరం కావడం, సంక్షేమ పథకాలు పొందేందుకు పడరాని పాట్లు పడతారని చెప్పారు. సచివాలయాల కుదింపు నిర్ణయాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల నేతలు పాల్గొన్నారు.

మందుబాబులూ మా ఊరు రావొద్దు



ప్రచారం చేస్తున్న గ్రామస్తులు

ఉబ్బెడిపుట్టు గ్రామస్తుల హెచ్చరిక

పాడేరు రూరల్: తమ గ్రామంలోకి మందుబాబులకు ప్రవేశం లేదంటూ మండలంలో చింతలవీధి పంచాయతీ ఉబ్బెడిపుట్టు గ్రామస్తులు గురువారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పీసా కమిటీ ఉపాధ్యక్షుడు బి.నాగరాజు మాట్లాడుతూ పంట పొలాలు, గరువుల్లో మందుబాబులు మద్యం తాగిన అనంతరం ఖాళీ సీసాలు పగలగొట్టి పడేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువుల కాళ్లకు పగిలిన మద్యం సీసాలు తగిలి తీవ్ర గాయాలు పాలవుతున్నాయన్నారు. పంటల సాగుకు కూడా వీల్లేకుండా పోతుందన్నారు. ఇకపై తమ గ్రామ సమీప ప్రాంతాల్లో మద్యం సేవిస్తే గ్రామస్తులు విధించిన చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. పంట పొలాలు, గరువుల్లో ప్లాస్టిక్, మద్యం సీసాలను ఎవరూ వేయకుండా పరిరక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మజ్జి నాగరాజు, నాని, రాము, గణేష్, కామరాజు, ఆశ కార్యకర్త బుల్లమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తగ్గని చింతపండు ధర



అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ: మండలంలోని కోనాం సంతలో ఈ గురువారం కూడా చింత పండు ధర తగ్గలేదు. కోనాం సంతకు హుకుంపేట, అనంతగిరి, దేవరాపల్లి, పాడేరు మండలాలకు చెందిన గిరి గ్రామాల చింత పండు భారీగా వస్తుంది. ఈ చింత పండుకు మంచి గిరాకీ ఉండడంతో విశాఖ, అనకాపల్లి, చోడవరం ల నుంచి వ్యాపారులు, వినియోగదారులు తెల్లవారు జామునే కోనాం చేరుకుని చింతపండు కొనుగోలు చెస్తుంటారు. ఈ వారం సంతకు భారీ స్థాయిలో చింతపండు వచ్చినా ధర మాత్రం గత వారం కంటే ఎక్కువ పలికింది. 30 కిలోల కావిడి చింత పండు రూ. 1800 నుంచి రూ. 2 వేల వరకు పలికింది.

చిన్నారులకు ఆట పాటలతో విద్య అవసరం



పెదబయలులో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు

పెదబయలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.హెచ్.వి.సత్యవాణి అన్నారు. గురువారం పెదబయలు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1లో అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పోషణ భీ..పడాయి భీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ జన్మించినప్పటి నుంచి మూడేళ్లలోపు నవ చేతన ద్వారా సంపూర్ణ పోషణ, పిల్లల పర్యవేక్షణ, పోషకాహారాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.సింహాచలం, డి.సరస్వతి పాల్గొన్నారు.

వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి



ప్రమాదానికి గురైన వాహనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: విశాఖ–అరకు ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహన చోదకులు జాగ్రత్తలు పాటించి, వాహనాలను నడుపుతూ ప్రయాణించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. గురువారం ఉదయం విశాఖ వెళ్తున్న ఎమ్మెల్యే.. సుంకరమెట్ట సమీపంలో ప్రమాదానికి గురైన కారును చూసి ఆగారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ ప్రయాణికులను పరామర్శించారు. జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆయన ఫోన్‌లో సూచించారు. అతి వేగంతో ప్రయాణించే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా గాశి ఉన్నారు.

కార్పెంటర్స్ ర్యాలీ

పాయకరావుపేట: కార్పెంటర్స్ డే సందర్భంగా పట్టణంలో కార్పెంటర్స్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు కార్పెంటర్స్ ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు కుసోజు శ్రీను, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామోజు నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డీవీవీ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.


అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన



అగ్నివీర్‌పై అవగాహన కల్పిస్తున్న భగవత్ సింగ్

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విశాఖపట్నంలోని ఇండియన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు విద్యార్థులకు అగ్నివీర్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ భగవత్‌సింగ్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసిన అగ్నివీర్ పథకం గురించి వివరించారు. వీడియోలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. దేశ రక్షణలో ప్రవేశించాలనుకునే యువతీ, యువకులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 4వ తేదీ గడువని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుద్ధ్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

కె.కోటపాడు: ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుద్ధ్యం సాధ్యపడుతుందని చీడికాడ ఎంపీడీవో వి.హేమ సుందరరావు అన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గురువారం చీడికాడ మండలంలో గల అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి తడిపొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు చేర్చే విధానం వివరించారు. వ్యాపారులు తడిపొడి చెత్తను ఏ విధంగా గుర్తించాలో కరపత్రాల ద్వారా తెలిపారు. చీడికాడ పంచాయతీ విస్తరణాధికారి గోపి, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, రాపేటి ప్రసాద్, చీడికాడ కార్యదర్శి ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా నిర్మాణ దశలో అంగన్‌వాడీ భవనం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం



అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పాడేరు రూరల్: మండలంలో డోకులూరు పంచాయతీ గుమ్మపుట్టు గ్రామంలో పదేళ్ల కిందట తలపెట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో అప్పటి నుంచి అద్దె భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఈ కేంద్రానికి 10 మంది చిన్నారులు, బాలమృతం కోసం ఏడుగురు, గర్భిణులు ముగ్గురు, బాలింతలు నలుగురు వస్తున్నారు. సొంత భవనం లేక చిన్నారులు ఆటపాటలకు దూరమవుతున్నారని గ్రామస్తులు మజ్జి సుశీల, మౌనిక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష కాలంలో నిత్యావసర సరకులను భద్రపరిచేందుకు కూడా అద్దె భవనంలో చోటు ఉండడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రసాభాసగా పురపాలక సంఘం సాధారణ సమావేశం

నర్సీపట్నం: నర్సీపట్నం పురపాలక సంఘం సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 34 అంశాలను కౌన్సిల్ ముందుంచారు. మున్సిపాలిటీకి చెందిన జనరల్ ఫండ్ నిధులను టీడీపీ కాంట్రాక్టర్ల ప్రయోజనానికి ఖర్చు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ఆరోపించారు. జనరల్ ఫండ్ నుండి రూ.1.75 కోట్లు ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లుగా చెలామణీ అవుతున్న టీడీపీ నాయకులకు మున్సిపల్ అధికారులు కట్టబెడుతున్నారన్నారు. వైస్‌చైర్మన్ చేసిన ఆరోపణలకు టీడీపీ కౌన్సిలర్లు సీహెచ్ పద్మావతి, ధనిమిరెడ్డి మధు, శ్రీకాంత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం చోటు చేసుకుంది.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



ఎలక్ట్రికల్ ఏఈ శంకరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: రాష్ట్రంలో విద్యుత్ ట్రూ అప్ చార్జీల పెంపును ఉపసంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి విద్యుత్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీపీఎం నేత డి. వెంకన్న మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి రూ. 9412 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేయాలని ఈఆర్‌సీ ఆదేశించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ. 7912 కోట్లు భారం మోపేందుకు రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పైడితల్లి, సన్యాశి, సోములు తదితర సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.